# ఓటమిలోగెలుపు

శ్రీధర్ కాలుగాలిన పిల్లిలా పచార్లు చేస్తున్నాడు. హైదరాబాద్ వేళ్ళే రైలు యింకారాలేదు. గంట ఆలశ్యం అయింది. రేపు అతను ఢిల్లీ వెళ్ళే రైలు ఎక్కాలి. రెండు రోజుల్లో అతను అనుకున్నది సాధించబోతున్నాడు. సివిల్ సర్వీస్ ఇంటర్వ్యూకు వెళుతున్నాడు. బాగా చేసి... వీలైతే కలెక్టర్ పోస్టు కొట్టేయ్యాలని అతని తహ తహ! ఐ.ఏ.ఎస్. అయి సంఘంలో తనకంటూ ఓ ప్రత్యేకమైన , స్థానం నిలబెట్టుకోవాలని అతని కోరిక! శ్రీధర్ అసలు ముందు ఎప్పుడూ ఐ.ఏ.ఎస్. అవుదామనుకోలేదు. ఆరోజు సంఘటనతో అతనిలో పట్టుదల వచ్చింది. మాలతి అతని వీధి చివర ఉండేది. మనిషి చాలా అందంగా బింకంగా ఉండేది. బంగారానికి సువాసన అబ్బినట్టు ఐశ్వర్యం తోడుఅయింది. ఇద్దరూ డిగ్రీ చేస్తూ ఉండేవాళ్ళు. ఆమె లేడీస్ కాలేజీలో చదివేది. శ్రీధర్ జెంట్స్ కాలేజీలో. కాని ఆమె చదివే కాలేజిలో ఫిజిక్సు లెక్చరర్ అంతబాగా చెప్పేది కాదు. ఎవరో ఆమెకి శ్రీధర్ ఫిజిక్సులో దిట్ట అని చెప్పారు. అప్పుడప్పుడుఅతని ఇంటికి వస్తూ ఉండేది ఫిజిక్సు చెప్పమని. అతని బోధనాశక్తికి ముగ్ధురాలై క్రమంగా అన్ని సబ్జెక్టులు చెప్పించుకోవడం మొదలెట్టింది. ఆ రకంగా అతనికి ఆమె బాగా పరిచయం అయింది. రాకపోకలతో స్నేహం వర్ధిల్లింది. ఓ రోజు ధైర్యం చేసి అడిగాడు శ్రీధర్ మాలతిని, పరీక్షలు అయింతర్వాత.

"మాలతీ!ఏమీ అనుకోకపోతే నే ఓ మాట అడుగుతాను. నే అడిగింది నీకిష్టమున్నా లేకపోయినా మన స్నేహం మటుకు యిలాగే ఉండాలి!" చెయ్యిజాపి అడిగాడు.

"వైనాట్! మన స్నేహం శాశ్వతం! అడుగు."

"నేను నిన్ను పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను. ఐలైక్ యు. ఐలవ్‌యు. ఐ వాంట్ టు మ్యారీయూ"!

"ఇలాంటి మాటలతో మన స్నేహాన్ని కలుషితం చెయ్యద్దు"! సీరియస్‌గా చెప్పింది మాలతి.

"నో! నేనూ సీరియస్ గా చెబుతున్నాను. నన్నర్థం చేసుకో", ఏడుపునాపుకుంటూ ప్రాధేయపడ్డాడు శ్రీధర్.

"షటప్! ఇంకెప్పుడూ ఈ ప్రస్తావన తేవద్దు. అలా అయితే మాఇంటికి రావద్దు". ఖచ్చితంగా చెప్పేసింది.

శ్రీధర్ బాగా షాక్ తిన్నాడు మొదట్లో. కాని తను బిగదీసుకుంటే ఆమె దర్శన భాగ్యం కరువవుతుందని అది మర్చిపోసాగాడు. క్రమంగా ఆమె మనసు మారుతుందని ఎదురుచూడ్డం మొదలెట్టాడు. అతను ఎమ్మెస్సీ తిరుపతిలో చేరిపోయాడు. మాలతి రెగ్యులర్‌గా చదవడం మానేసి ప్రైవేట్‌గా ఎమ్మే కట్టుకుంది. అతను చదువులోమునిగిపోయి చాలాకాలం రాలేకపోయాడు. పరీక్షలు రాసి ఇంటికొచ్చిన అతనికి షాక్ తగిలింది. అతని తల్లి మాలతి శుభలేఖ అందించింది. రివ్వున పరుగెత్తుకుంటూ వెళ్ళాడు మాలతి దగ్గరికి. ఒంటరిగా ఉండడం చూసి అడిగేశాడు.

"మాలతి! ఇదేంటి? ఇది నీకు పుట్టిన బుద్ధేనా ? ఎందుకీ పెళ్ళికి ఒప్పుకున్నావ్?"

"ఆడపిల్లకు పెళ్ళి తప్పనిసరి కనుక."

"కాని... కాని... నేను వచ్చేదాకా ఆగి ఉండాల్సింది. నేను నిన్ను చేసుకునేవాడ్ని. ఇప్పటికైనా మించి పోయింది లేదు. ఈ పెళ్ళి యిష్టంలేదని చెప్పు ప్లీజ్! చెప్పు!" బ్రతిమాలాడు.

ఉన్నట్టుండి పెద్దగా నవ్వింది మాలతి.

బిత్తరపోయాడు శ్రీధర్.

"శ్రీధర్! నేను నిన్ను పెళ్ళి చేసుకుంటానని ఎలా అనుకున్నావ్?"

"నిన్ను ప్రేమించాను కాబట్టి!"

"మరి నేనూ ప్రేమించాలిగా!"

"నిజమే! కాని తప్పకుండా ప్రేమిస్తావనుకున్నాను."

"ఏం చూసి ప్రేమించాలి నిన్ను?" సూటిగా అడిగింది.

పిడుగు పడ్డట్టయింది.

"మాలతి! నువ్వేనా అడుగుతున్నది?"

"యస్? నిన్ను ఏం చూసి ప్రేమించాలి? నీ దగ్గరేయుంది?"

"ఏం లేదు?" కోపంగా అరిచాడు. "ఎమ్మెస్సి చదివాను. సంస్కారం ఉంది. చదువుంది. రేపో మాపో ఉద్యోగం వస్తుంది. మనసున్న మనిషిని." ఆవేశంగా అన్నాడు. ఆమె పెదవి విరిచేసింది.

"నా అంతస్తు ఎక్కడ నీ అంతస్తు ఎక్కడ. అప్టరాల్! ఓ సామాన్యుడివి. మహా అయితే ఓ బోడి ఉద్యోగం వస్తుంది. రెండు పూటలా తిండి పెట్టగలుగుతావు కాని కార్లల్లో తిప్పగలవా? ఇంటి నిండా నౌకర్లను పెట్టగలవా? కాని ఇప్పుడు నేను చేసుకోబోయే ఆయన నన్ను కాలుకింద పెట్టనివ్వడు. లక్షలకొద్దీ ఆస్తి ఉంది.. బంగారంలాంటి వ్యాపారం ఉంది." మాలతి అతని సమాధానానికి ఎదురు చూడకుండా లోపలికి వెళ్ళిపోయింది. వివర్ణమైన మొహంతో ఇంటికి వచ్చేశాడు. మానసిక ఆరోగ్యం కోసం పిహెచ్.డి. లో చేరాడు. మూడేళ్ళు సవ్యంగానే సాగింది. ఇంకో సంవత్సరంలో అయిపోతుందనగా డబుల్ టైఫాయిడ్ తెచ్చుకుని ఇల్లు చేరుకున్నాడు.

టైఫాయిడ్ తగ్గినా కోలుకోవడానికి ఆర్నెల్లు పైన పట్టింది. ఈ లోగా అతని గైడ్‌కు ఫారిన్ ఛాన్సు తగిలితే వెళ్ళిపోయాడు. అతని స్థానంలో వచ్చిన ప్రొఫెసర్‌కు ఇతనికి సరిపోదు. అతనికింద డాక్టరేట్ చేసేదేంటని మళ్ళీ కంటిన్యూ చెయ్యలేదు. మాలతి పండంటి యిద్దరు పిల్లల్ని తీసుకుని ఓ రోజు శ్రీధర్ని చూడ్డానికి వచ్చింది.

"హలో శ్రీధర్! బాగున్నావా? ఆమధ్య బాగో లేదట!"

"మీ పిల్లలా? బాగున్నారు!?"

"మరి బావుండకేం చేస్తారు.. ఆయన ఎంత శ్రద్ధ తీసుకుంటారని... అన్నట్టు పిహెచ్.డి. మధ్యలోనే మానేశావా? ఎందుకు?" కుతూహలంగా అడిగింది.

"ఎందుకో నాకు చెయ్యబుద్ధికాలేదు."

"పోనీ మావారి ఆఫీసులో ఓ పోస్టు ఖాళీగా ఉంది. చేస్తావా! రికమెండ్‌చేస్తాను. జీతం రెండు వేలు. నీకుసరిపోతుంది." ఆశగా అడిగింది మాలతి.

"అంతకంటే ఎక్కువ సంపాదించలేననా నీ ఉద్దేశం?" సూటిగా అడిగాడు.

"అనికాదు... కాని ఈ కాలంలో రెండు వేలు ఎవరిస్తారు రా' కాండిడేట్లకు? మీ నాన్న రిటైర్ అవుతారుగదా ఈ ఏడు.. కొంచెం సాయం చేద్దామని." ఆరిందాలా చెప్పింది ఆ కుటుంబాన్ని తను ఉద్ధరించబోతున్నట్లు.

"అవున్రా - చేరకూడదూ !" తండ్రి రామారావు అడిగాడు.

"అవును బాబూ! మాలతి మనకు తెల్సినమ్మాయి కాబట్టి పిలిచి యిస్తానంటున్నది...ఎందుకు చేరకూడదు?" తల్లి నిలదీసింది.

"సారీ మాలతి! గవర్నమెంట్ జాబ్ చెయ్యాలనుంది."

"నీకేమన్నా మతి పోయిందా? ఓచిన్న పోస్టుకు ఎన్ని రికమండేషన్లు-ఎన్ని లంచాలు తెలీదా?" మాలతి అంది.

"నా శక్తిమీద నాకు విశ్వాసం ఉంది." చెప్పాడు.

"సిరిరా మోకాలు అడ్డుపెట్టమాకు!" మాలతి అంది.

"మాలతి నీ అభిమానానికి చాలా చాలా కృతజ్ఞతలు... నేను ఒకవేళ ఏచిన్న ఉద్యోగం కూడా సంపాదించుకోలేకపోయినా నిన్ను వంటుకు అడగను. సరేనా." అంటూ విసురుగా బయటికెళ్ళిపోయాడు.

ఆరోజు నుండి అతను పట్టుదలతో సివిల్ సర్వీసుఎగ్జామ్స్ పైన శ్రద్ధ చూపించసాగాడు. రాత్రింబగళ్ళు దీక్షతో చదివాడు. ప్రిలిమ్స్ అవలీలగా పాసై... మెయిన్ ఎగ్జామ్స్ అన్నీ సంతృప్తిగా రాస్తూ ఉండగా.. చివరి ఎగ్జామ్‌స్ట్రెయిన్ వలన నూటయిదు డిగ్రీల జ్వరం ముంచుకొచ్చి పరీక్ష రాయలేకపోయాడు. తన దురదృష్టాన్ని నిందించుకుంటూ కుమిలిపోయాడు. తరువాతి సంవత్సరం మెయిన్ కూడా పాసయ్యాడు. ఇంటర్వ్యూకు హాజరుకావలసినప్పుడు స్కూటర్ యాక్సిడెంట్ అయింది. నెల రోజులు పైగా హాస్పిటలైజ్‌డ్! అంతే అతని కలలు కరిగి పోయాయి. ఈసారి అటువంటి పరిస్థితులు రాకూడదని ఎన్నో జాగ్రత్తలుతీసుకున్నాడు. అస్సలు ఢిల్లీలోనే మకాం పెడదామనుకున్నాడు. కాని ఆర్థిక ఇబ్బందులవలన ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. ఇప్పుడు యింకా రైలు రాలేదు. గంట ఆలశ్యం. ఈసారి సెలెక్షన్ కొట్టి అపాయింట్‌మెంట్ ఆర్డర్ దీసుకుని గర్వంగా మాలతి దగ్గరకి వెళ్ళాలి. తను కూడా మాన్యుడని తెలియచెప్పాలి!

బెల్ మోగింది. దూరంగా చీకట్లను చీల్చుకుంటూ దీపం దూసుకొస్తున్నది. కలకలం చెలరేగింది ప్లాట్‌ఫారమ్ మీద. అందరూ రైలు ఎక్కడానికి రెడీ అవుతున్నారు. రైలు వచ్చి ఎదురుగా ఆగింది. అతని గుండె లబ్‌డబ్‌మని కొట్టుకుంటున్నది. ప్రయాణీకుల్ని దూసుకుంటూ ముందుకుపోయి ఓ ఖాళీగా ఉన్న కంపార్ట్‌మెంట్‌లో దూరాడు. బెడ్ షీట్ తీసిపరుచుకున్నాడు. ఎట్టకేలకు తను ఇంటర్వ్యూకు వెళ్ళగలుగుతున్నాడు.

గంట మోగింది వీనుల విందుగా. రైలుకూతతో శృతి కలిపింది. కిటికీలోంచి స్టేషన్‌కు వీడ్కోలిస్తున్నట్టు చూశాడు. అర్థరాత్రి కావడం మూలాన ఇంట్లోవాళ్ళెవరూ సెండాఫ్‌కురాలేదు. తండ్రికి

ఈమధ్య సుస్తీగా ఉంటున్నది. పెండ్లికి ఎదిగిన చెల్లెలు! పెద్దగా స్నేహితులు లేరు... రాత్రిపూట వచ్చి సెండాఫ్ యివ్వడానికి. తమ తమ సన్నిహితులకు కొందరు చెయ్యిఊపుతున్నారు. రుమాళ్ళుఊపుతున్నారు.

తన కోసం ఎవరూ రాలేదన్న దిగులును గుండెల్లో అదిమిపెట్టి చిలిపిగా గాల్లోకి చెయ్యి ఊపాడు. ఎత్తిన చెయ్యి కిందకి దిగలేదు... యింకెవరో అతనికి చెయ్యి ఊపారు. చిన్నగా రైలు కదిలింది ఎవరో చూసేలోపు మనుషులు అడ్డమొచ్చారు.

"అన్నయ్యా!" ఏదో సుపరిచిత కంఠం పిలుపు. ఉలిక్కిపడ్డాడు. కళ్ళు చింపుకుని చూశాడు. చెల్లెలు శోభ పరుగెత్తుకుంటూ వస్తున్నది. చీర కాళ్ళ కడ్డుపడకుండా ఓ చేత్తో పట్టుకుని యింకో చేత్తో వద్దు అన్నట్టు చెయ్యి ఊపుతున్నది. ఓ క్షణం మెదడు మొద్దుబారింది. మరుక్షణం మెరుపులా లేచి సూట్‌కేస్ అందుకుని ఆఘమేఘాల మీద డోర్ దగ్గరికి వచ్చి.నడుస్తున్న రైల్లోంచి కిందకు దూకాడు ప్లాట్‌ఫారమ్ మీదకు. ముందుకు పడబోతున్నతడు స్తంభాన్ని పట్టుకుని నిలదొక్కుకున్నాడు. శోభ అతన్ని చేరుకుంది వగరుస్తూ.

"ఏమైంది?" కంగారుగా అడిగాడు.

"నాన్నకు సీరియస్.... హాస్పిటల్ తీసుకుపోయాం... తొందరగారా! ఎమర్జెన్సీ... హార్ట్ఎటాక్!" ఆయాసపడ్తూ చెప్పింది.

తను ఇల్లు వదిలి రెండు గంటలు కూడా కాలేదు. ఈలోగా ఎటువంటి దారుణమైన పరిణామాలు భగవాన్! ఆటోలో హాస్పిటల్ కు చేరుకున్నారు. ఇంటెన్సివ్‌కేర్‌యూనిట్‌లో ఉన్నాడు. ఆక్సిజన్ పెట్టారు. డాక్టర్లు అటెండ్ అవుతున్నారు.

"ఎలా జరిగింది?" ఓగంట అయింతర్వాత అడిగాడు తల్లిని.

"నువ్వు వెళ్ళింతర్వాత బాత్‌రూమ్‌కు వెళ్ళారు.. అక్కడ పడిపోయారు. ఎంతకీ బయటకు రాకపోయేసరికి మాకు అనుమానం వచ్చి వెళితే అక్కడ అన్‌కాన్షస్‌గా మూలుగుతూ పడి ఉన్నారు. వెంటనే పక్కంటివాళ్ళను లేపి హాస్పిటల్‌లో చేర్పించాము". ఆమె ఏడుస్తూ చెప్పింది.

"లైఫ్ గ్యారంటీ యివ్వలేమన్నారు డాక్టర్లు.అందుకే ఎంతో ఆలోచించి ఆలోచించి నీ కోసం వచ్చాను". కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది శోభ.

తెల్లారింతర్వాత కొందరు స్నేహితుల్ని కల్సుకుని ఆఊళ్ళో ఉన్న మంచి ప్రైవేట్ డాక్టరును కూడా పట్టుకొచ్చాడు.అన్ని పరీక్షలు అయింతర్వాత –

"ఇరవైనాలుగు గంటలు గడిస్తేకాని ఏం చెప్పలేం.." స్పెషలిస్టు అన్నాడు.

"బట్ సర్! నాకు ఎల్లుండి పొద్దున ఐ.ఏ.ఎస్. ఇంటర్వ్యూ ఉంది ఢిల్లిలో.. నే వెళ్ళొచ్చా!" ఎంతో ఆదుర్దాగా అడిగాడు.

"మీయిష్టం! కండిషన్ మటుకు చాలా బ్యాడ్‌గా ఉంది. మీరుండి కూడా ఏం చేయగలరు అని అనుకుంటే వెళ్ళిరండి.. డాక్టర్లం మేమున్నాంగా!" అతను అభయమిచ్చాడు.

కొన్ని గంటలు మనసులో మథనపడ్డ తర్వాత తల్లితో అన్నాడు శ్రీధర్ ఆమెను కొంచెం బయటకు తీసుకుపోయి.

"అమ్మా! నేను ఫ్లైట్‌లో ఢిల్లీ వెళ్ళి మళ్ళీ ఫ్లైట్‌లో వస్తాను. డబ్బులు గురించి ఆలోచించమాకు. వేలు అప్పుగా యిచ్చేదానికి మా ఫ్రెండ్స్ రెడీగా ఉన్నారు. సెలక్షన్ కాగానే తీర్చేస్తాను".

అతను ఏం చెబుతున్నది ఆమెకు ముందు అర్థంకాలేదు. తర్వాత అతని వంక తీక్షణంగా చూసి నిదానంగా అంది...

"వెధవా! తండ్రి ప్రాణం కంటే నీకు ఇంటర్వ్యూ ముఖ్యంరా?"

అంతే! శరఘాతం తిన్న పక్షిలా అతని మనసు, మూడ్ ముక్కలైపోయాయి. శ్రీధర్ పోవడానికి ప్రయత్నించలేదు, మిగతావాళ్ళు ఎంత ప్రోత్సహించినా! క్రమంగా రామారావు ఆరోగ్యం కుదుటపడింది. ఇంట్లో తిరుగుతూ ఉన్నారు తేలిగ్గా! కాని బరువెక్కిన మనసుతో శ్రీధర్ ఏదో పోగొట్టుకున్నవాడిలా అయిపోయాడు. తన ఆవేదనంతా వెళ్ళగక్కుతూ తన గురువుకు లెటరు రాసి అమెరికాకు పోస్టు చేశాడు. అయనేదో చేస్తారని కాదు... కాని ఆయనకు తనంటే అభిమానం, తనపైన విపరీతమైన నమ్మకం ! నిజమైన ఆత్మీయులతో బాధలు బరువు పంచుకుందామని రాశాడు. కాని అతను ఊహించని జవాబు వచ్చింది.

"నీ కోసం నా ఇన్‌ఫ్లుయెన్స్ అంతా ఉపయోగించి అమెరికాలో ఓ రీసెర్చి అసిస్టెంట్ పోస్టు రిజర్వు చేయించాను. నెలకి యిరవై వేలపైనే! కాని నువ్వు ఓ నెలలోగా వచ్చి జాయిన్ కావాలి. లేకపోతే వచ్చిన అపాయింట్‌మెంట్ కాన్సిల్ అవుతుంది".

శ్రీధర్ ఈసారి ఎవరినీ సంప్రదించకుండా తన సర్టిఫికెట్లు మొదలైనవి ఆయనకు పంపించేశాడు. అనుకున్నట్టుగానే ఆయన అపాయింట్‌మెంట్ ఆర్డరు పంపించాడు ఓనెల టైం యిస్తూ. శ్రీధర్ కాళ్లో స్ప్రింగులున్నట్టు మద్రాసు, తిరుపతి, హైదరాబాద్ వగైరాల చుట్టూ తిరిగాడు తనకు కావలిసిన సరంజామా సమకూర్చుకోవడానికి. ఫ్లైట్ టికెట్ కూడా బుక్ చేయించుకున్నాడు మూడు రూపాయల వడ్డీకి ఓ యిరవై అయిదు వేలు అప్పు తెచ్చుకుని. జులై పదమూడు మద్రాసు నుండి ఫ్లైట్ క్యాచ్ చెయ్యాలి. మిత్ర బృందంలో గొప్ప సందడిగా ఉంది. పార్టీపైన పార్టీలు! పదకొండున అతను మద్రాసుకు బయలుదేరాల్సి ఉంది. ఆరోజు అతనికి ఘనంగా పార్టీ యిచ్చారు.

రాత్రికి బస్సుఎక్కాలనగా మధ్యాహ్నం నుండి కడుపు నొప్పి మోషన్స్ మొదలయ్యాయి. డాక్టరు రాసిచ్చిన మందులు వాడాడు, ఫలితం లేకపోయింది. సాయంత్రానికి డయేరియాతో బాగా నీర్సపడిపోయాడు. అలానే పోతానంటూన్నాడు. అతని మాట ఖాతరు చేయకుండా శ్రీధర్ని హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. డాక్టర్లు వెంటనే సెలైన్ ఎక్కించారు ఐదు బాటిళ్ళు. మందులిస్తూ గ్యాస్ట్రోఎన్‌ట్రైటిస్ అని తేల్చారు.

"మీరు ఓగంట ఆలస్యంగా మీ అబ్బాయిని తెచ్చినా బహుశా లైఫ్ సేవ్ చేయలేకపోయి వుండేవాళ్ళం!" వింటున్న రామారావుకు మతిపోయింది.

శ్రీధర్ మగతగా పడుకుని కలవరిస్తున్నాడు."అమెరికా... మద్రాస్... నో.... నే వెళ్ళాలి... నో.... నే పోతా..."

పదమూడో తేదీ పుట్టింటికి వచ్చిన మాలతి అతన్ని పరామర్శించడానికి వచ్చింది.

"హలో! ఎలా ఉంది?"

నీరసంగా నవ్వాడు.

"ఏంటి? అమెరికాలో పెద్ద జాబ్ సంపాదించావుట!" విస్మయంగా కళ్ళు తిప్పుతూ అంది మాలతి.

'హుష్ కాకి' అన్నట్లు చేతులుతిప్పాడు.

"ఇంత సువిశాల దేశంలో నీకు చిన్న ఉద్యోగం కూడా దొరకలేదా... మెరికలా ఎకాఎకిన రెక్కలు కట్టుకుని అమెరికాకు ఎగిరిపోతున్నావు." మాలతి నవ్వుతూ అంది.

"అలా చెప్పమ్మా! వాడు కొన్ని వేల కిలో మీటర్ల దూరంలో ఉంటే మేమేం అయిపోతాం.. మా సంగతి అటుంచి... సుస్తీ పిల్లాడు... అక్కడ ఎలా అడ్జెస్టు కాగలడు?" తల్లి ఆవేదనతో కళ్ళు తుడుచుకుంటూ అంది.

"శ్రీధర్! ఎవరికీయిష్టంలేని ప్రయాణం ఎందుకు? ఎక్కడో ఉండి నువ్వు లక్షలు సంపాదించడం వేరు..మీవాళ్ళ కళ్ళ ఎదుట ఉండి వేలు సంపాదించడం వేరు. డోంట్ గో!" మాలతి అతని చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అంది.

"కాని - కాని- నేను... నేను... గొప్పవాడినికావాలి!"

"పిచ్చివాడా! అందరూ అందలం ఎక్కితే మోసేవాళ్ళు ఎవరు? ఇప్పుడు నీకేం తక్కువ? చాలా మందికంటే చాలా గొప్పవాడివి!" మాలతి మృదువుగా కొడుతూ అంది.

అతని కళ్ళు మెరిశాయి ఆమె పొగడ్తకి.

(స్వాతి వార పత్రిక)

